# లవ్ స్టోరీ — టీజింగ్

కాలేజీ ఆవరణంతా కోలాహలంగా వుంది. రంగు రంగుల చీరల్లో సీతాకోక చిలుకల్లా అమ్మాయిలు తమ హంస గమనాల్తో, క్రీగంటి చూపులతో, ఛలోక్తులతో, చమత్కారాలతో కాలేజీ గ్రౌండంతా తిరుగుతూంటే ఎంతటి బుద్ధి మంతుడైన మగ వాడైనా వెనుదిరిగి చూసేటంత ముచ్చటగా వుందాదృశ్యం.

ఇంతలో కీర్తి, రమ్య, జ్యోతిలతో కలిసి కాలేజ్‌లో ప్రవేశించింది అమృత. నిమ్మపండు రంగు శరీర ఛాయ, చూడగానే ఆకర్షించే అయస్కాంతాల్లాంటి కళ్ళు, సంపెంగను తలదన్నే, నాసిక, ముద్దొచ్చే లక్కపిడతలాంటి నోరు. పింక్ కలర్ పంజాబీ డ్రస్‌లో మంచులో తడిసిన గులాబీలా స్వచ్ఛంగా వుంది.

అమృత ఆ కాలేజీలో బి.ఎస్సీ ఫైనలియర్ చదువుతోంది. అత్యంత చురుకుగా, అందంగా వుండే అమృత అంటే ఆ కాలేజీ అబ్బాయిలకు విపరీతమైన క్రేజ్. రమ్య, కీర్తి, జ్యోతి, అమృత ఈ నల్గురూ మంచి స్నేహితులు. ఈ నల్గురూ ఎప్పుడూ నవ్వుతూ, తుళ్ళుతూ ప్రతి స్టూడెంట్‌ని ఏదో కామెంట్ చేస్తూ ఆ కాలేజ్‌కే అందాన్ని చేకూరుస్తున్నట్టుంటారు.

కెమిస్ట్రీక్లాస్ అయి పోవడంతో అమృత బృందం కబుర్లు చెప్పుకుంటూ వస్తున్నారు. ఇంతలో నేవీ బ్లూ బ్యాగీ మీద ఫుల్ హేండ్స్ వైట్ షర్టు టక్ చేసి హుందాగా వున్న వ్యక్తి ఎదురుగా వస్తూ అమృతకి డాష్ ఇచ్చాడు. ముందుకు తూలి పడబోయి నిలదొక్కుకుని "వాట్ మిస్టర్! ఏ అమ్మాయితో పగటి కలల్లో డ్యూయేట్ పాడుకుంటూ విహరిస్తున్నారు?" అని అమృత అనే సరికి అమ్మాయిలంతా ఘొల్లు మంటూ నవ్వారు. అమ్మాయిల ముందు ఫూల్ అయిన ఆ వ్యక్తి తలొంచుకుని గబగబా వెళ్ళి పోయాడు.

*  *  *  *

టైమ్ 9.30 కావడంతో "అమ్మా నేను కాలేజ్‌కి వెళ్తున్నా" అన్చెప్పి సందుమలుపు తిరిగిన అమృతకి నిన్న తను కామెంట్ చేసిన వ్యక్తి ఎదురు పడడంతో ఆశ్చర్య పోయింది. అమృతని చూసి అతను కూడా ముందు ఆశ్చర్య పోవడం, తర్వాత తనకి నిన్న జరిగిన అవమానం గుర్తొచ్చి గబగబా తన దగ్గర కొచ్చి "ఏంటి డియర్. ఈ రోజు కాలేజ్ ఎగ్గొట్టకూడదూ? సరదాగా మార్నింగ్ షోకి వెళ్దాం" అని రాష్‌గా అనే సరికి భయంగా, కంగారుగా చుట్టూ చూసింది. అప్పటికే తను రోడ్డు మీదకి వచ్చేసింది. నడక ఆపలేదు. అంతలో బస్ స్టాప్ దగ్గరర పడడంతో "బై సీయూ" అంటూ అతడు వెళ్ళి పోగానే హమ్మయ్య అని ఊపిరి పీల్చుకుంది.

కాలేజికి వెళ్ళిన తర్వాత మిగతా ముగ్గురితో ఈ విషయం చెప్పింది అమృత. అప్పుడు "ఆ అబ్బాయి పేరు, అనిల్ అట. సి.ఎ. చేస్తున్నాట్ట, మా చెల్లి వాళ్ళ క్లాస్‌మేట్ రాధ వాళ్ళన్నయ్యట!" అని జ్యోతి చెప్పేసరికి, అనవసరంగా కామెంట్ చేశానేమో అన్పించింది అమృతకి.

*  *  *  *

"ఎర్రంచు పచ్చతీర తల్లోన జాజిమాల" అని టీజ్ చేస్తూ అనిల్ పాడుతుంటే, తన చీరవైపు చూసుకున్న అమృతకి ఆ కామెంట్ తనను ఉద్దేశించే అని అర్థమవ్వగానే వుక్రోషంతో విసవిసా వెళ్ళిపోయింది.

*  *  *  *

"నిలువవే వాలుకనుల దానా వయారి హంస నడక దానా నువ్వు కులుకుతు గలగల నడుస్తు వుంటే నిలువదే నా మనసు ఓలలనా!" అని అనిల్ గొంతు వినబడే సరికి ముందుకు పడని తడబడ్తున్న అడుగులతో గబగబా వెళ్ళి పోయింది అమృత.

*  *  *  *

—రచయిత్రి చిరునామా—
ఎన్. రాజేశ్వరి
D/O ఎన్.ఎస్.ఎన్. రాజు
గాంధిపేట వీధి బారువా పోస్ట్
శ్రీకాకుళం జిల్లా 532 263

"ఒరే! నేను పెళ్ళి చేసుకోబోయే అమ్మాయి ఎలా వుంటుందో తెలుసా! ఆ ముందు వెళ్ళిందే సైకిల్ బ్లూ చీరకట్టుకున్న అమ్మాయి, ఆ అమ్మాయిలా 5'-5" ఎత్తు, పెద్దజడ, సన్నగా నాజూగ్గా సన్న జాజి మొగ్గలా వుంటుంది. పేరు అమృత" అని తన ఫ్రెండ్‌తో అంటున్నా అనిల్‌కి రాష్‌గా సమాధానం చెప్పాలని తలెత్తే సరికి వాళ్ళు తనని దాటి వెళ్ళి పోవడంతో నిస్సహాయంగ వుండి పోయింది అమృత.

*  *  *  *

"యు ఆర్ లుకింగ్ సో బ్యూటిఫుల్ టుడే ఐలవ్యూ" అన్న మాటలు తన చెవి పక్కగా వినబడే సరికి తుళ్ళిపడి తలెత్తిన అమృతకి కన్నుగీటుతూ చెయ్యూపి వెళ్తున్న అనిల్ కన్పించే సరికి సిగ్గుతో కనురెప్పల్ని వాల్చేసింది.

*  *  *  *

పడుకుని ఉన్న అమృత ఆలోచనలు అనిల్ చుట్టూ ముసురుకున్నాయి. అనిల్ పరిచయం నుంచి ఇన్నాళ్ళకాలంలో జరిగిన సంఘటనలని తలచుకుంటుంటే కోపం, ఉక్రోషం, సిగ్గు కలగాపులగంగా కలగసాగాయి. రోజూ తను కాలేజ్‌కి వెళ్తున్నప్పుడు అనిల్ తనని ఏదో ఒకటి అంటూండడం, కాలేజ్‌కి వెళ్ళిన తర్వాత తను మిగతా ముగ్గురితో ఆ విషయం చెప్పటం, నువ్వు కూడా ఏదో విధంగా టీజ్ చెయ్యమని వాళ్ళు ప్రోత్సహించడం, తను కూడా అలాగే అనుకోవడం, కానీ తీరా అనిల్ ఎదురు పడే సరికి సూటిగా అతని కళ్ళలోకి చూడలేక పోవడం ఎంతో మంది అబ్బాయిల్ని సరదాగా కామెంట్ చేసి, ధైర్యంగా మాట్లాడిన తను అనిల్ దగ్గర ఎందుకలా మూగగా మారి పోతుంది? అనిల్ టీజ్ చెయ్యడం ఒక వైపు తనకి బాధగా వున్నా, ఒక వైపు థ్రిల్లింగ్‌గానే వుంది. తనకి తెలియకుండానే అనిల్ వైపు బలంగా ఆకర్షించ బడింది. తను! ఇలా అనిల్ ఆలోచనలతో అలసి పోయిన అమృతకి నిద్రాదేవి ఎప్పటికోగాని కరుణించలేదు.

*  *  *  *

ప్రతి రోజూ ఆ స్థలంలోకి వచ్చే సరికి తనని టీజ్ చేస్తూ వినపడే అనిల్ గొంతు ఇంకా విన్పించకపోయేసరికి అమృత తలెత్తి చుట్టూ కలియజూసింది. అనిల్ కన్పించక పోయే సరికి చాలా నిరాశకి లోనయ్యింది.

ఇలా మరో రెండు రోజుల గడచి పోయాయి. కానీ అనిల్ మాత్రం కన్పించలేదు. అనిల్ రోజూ టీజ్ చేస్తుంటే బాధేగాని అనిల్ కన్పించక పోయే సరికి, పిచ్చెక్కినట్టుగా వుంది అమృతకి. ఎంతో స్ట్రిక్ట్‌గా వుండే తనేనా అనిల్ గురించి ఇంతగా ఆరాట పడుతూంది అన్పించింది అమృతకి.

*  *  *  *

"మీకీ విషయం తెలుసా! అనిల్‌కి ఆక్సిడెంట్ అయ్యిందట, తలకి బాగా దెబ్బ తగిలిందట. హాస్పిటల్‌లో వున్నాడట. నాకూ నిన్ననే తెల్సింది." అని జ్యోతి చెప్పేసరికి అమృత ముఖం వివర్ణమై పోయింది. అమృత ఫీలింగ్స్‌ని పరిశీలిస్తున్న రమ్య "ఏమిటే అలా అయి పోయావ్?" అనడిగింది. "ఏంలేదు" అని ముభావంగా సమాధానం చెప్పి ఊరుకుంది. ఇంక శ్రద్ధగా క్లాసుని వినలేక పోయింది.

ఇంటికి వచ్చిన దగ్గర్నుంచి అనిల్‌కి ఎలా వుందో అని ఆరాట పడసాగింది అమృత. అనిల్ గురించి ఆలోచిస్తూ రాత్రంతా నిద్రకి దూరమయి గడిపింది.

ఉదయం లేచిన తర్వాత 'అనిల్‌ని చూడ టానికి వెళ్తే' అనుకుంది. మళ్ళీ వెంటనే 'తను వెళ్తే చూసిన వాళ్ళు ఏమనుకుంటారు? అనిల్ ఏమను కుంటాడు! తన క్లాస్ మేట్స్‌కి ఎవరికైనా తెలిస్తే తనగురించి ఏ మనుకుంటారు?' ఇలా చాలా సేపు తనలో తనే మధనపడి ఇటు వెళ్ళలేక, అటు అనిల్‌కి ఎలా వుందో తెలుసు కోవాలనే ఆరాటం- ఇలా తనలో తనే ఘర్షణ పడి చివరికి వెళ్ళాలనే కోరికను చంపుకోలేక పోయింది అమృత.

*   *   *   *



తలకి బ్యాండేజితో దిండునానుకుని మంచ మీద కూర్చుని పత్రికలు చదువుతూ అనిల్ తలుపు దగ్గర అలికిడవ్వడంతో తలెత్తి చూశాడు. గుమ్మంలో అమృత నిలబడి వుండడంతో ముందు తనకళ్ళని తనే నమ్మలేక పోయాడు. తర్వాత ఆశ్చర్య పోయాడు. వెంటనే ఆనందంగా "రండి అమృతా!" అన్నాడు.

"మిమ్మల్ని టీజ్ చేసినందుకు నాకు తగిన శాస్తి జరిగిందని చూడటానికి వచ్చారా" అని అనిల్ అనడంతో- అమృత నొచ్చుకుంటూ "ఛ అలా అనకండి. మీ కిప్పుడు ఎలా వుంది" అనడిగింది.

"ఫర్వాలేదు. మరోవారం రోజుల్లో డిశ్చార్జి చేస్తానని డాక్టర్ ఇప్పుడే చెప్పారు" అన్నాడు అనిల్.

అమృత రావడం అనిల్‌కి చాలా సంతోషం అన్పించింది. తనకి అమృత మీద వున్న ప్రేమని వ్యక్త పరచడానికి ఇంతకంటే మంచి సమయం రాదు అన్పించింది. కానీ తీరా తన ప్రేమని వ్యక్త పరచిన తర్వాత అమృత కాదంటే...! నేనిన్నాళ్ళా తనని కామెంట్ చేసింది ఆమె మీద ప్రేమతోనే గానీ, కోపంతో కాదని తను చెప్తే అమృత నమ్ముతుందా? ఇలా అనుమానాలు ఒక వైపు, అమృత తనని చూడటానికి వచ్చిందంటే... తన మీద ప్రేమ వుండబట్టే కదా అని నమ్మకం ఒక వైపూ ఇలా తనలో తను మధన పడి చివరికి తన ప్రేమని అమృతకి తెలియజేయాలనే నిశ్చయానికొచ్చాడు.

"అమృత గారూ! మీతో ఒక విషయం చెప్పాలను కుంటున్నాను" అన్నాడు అనిల్.

ఏం చెబుతాడా అని ఆసక్తిగా చూస్తున్న అమృత కళ్ళలోకి చూస్తూ "అమృతా! నా మీద మీ అభిప్రాయం ఏమిటి? రోజూ మిమ్మల్ని కామెంట్ చేస్తున్నానని నన్నొక రోమియో అనుకుంటున్నారా? మీరునన్ను కామెంట్ చేసిన తర్వాత కొన్నాళ్ళు సరదాగా మిమ్మల్ని టీజ్ చేసే వాడిని. కొన్నాళ్ళకు మీరంటే ఒక విధమైన ఇష్టం ఏర్పడింది. ఆ యిష్టం ప్రేమగా మారింది. నా మనసులో మాటని మీకు చెప్పాలని రోజూ అనుకునే వాణ్ణి, కానీ నన్ను చూడగానే లేడిలా బెదిరే మీ కళ్ళని చూస్తే మిమ్మల్ని టీజ్ చెయ్యాలనిపించేంది. నేనంటే మీ మనసులో వున్న భావాన్ని తెలియ జేస్తారా?" అని నిజాయితీగా అడుగుతున్న అనిల్‌ని చూస్తుంటే, మనసంతా అనిల్ మీద అభిమానంతో నిండి పోగా మౌనమే తన అంగీకారంగా తెలియ జేసింది అమృత. ■